ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

3



అనకాపల్లి

జిల్లా వార్తలు

ఆదివారం 14 జూలై 2024

నర్సీపట్నంలో చెత్త నిర్వహణ అధ్వానం

తడి, పొడి చెత్త నిర్వహణ అస్తవ్యస్తం

- మరమ్మతులకు గురైన కంపాక్టర్, ఎక్స్‌కవేటర్
- వినియోగంలోకి రాని కంపోస్ట్ యార్డు
- డింపింగ్ యార్డుకు రోడ్డు సౌకర్యం లేక అవస్థలు
- పట్టించుకోని పాలకవర్గం, ఉన్నతాధికారులు

- 5లో

ఖరీఫ్‌కు కష్టకాలం!

తీవ్ర వర్షాభావ పరిస్థితులతో సాగుపై సందిగ్ధం



చోడవరం మండలంలో గౌరీపట్నంలో సాగు చేయకుండా ఖాళీగా వదిలేసిన పొలాలు

- జిల్లాలో చాలా మంది రైతులు నారుమళ్లు తయారీకి వెనుకడుగు
- బీళ్లుగా కనిపిస్తున్న పొలాలు
- వరుణుడిపైనే ఆశలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వర్షాలు సక్రమంగా కురవక పోవడంతో ఖరీఫ్ సాగుకు కష్టాలు తప్పేలా లేవు. వరి నారుమడుల తయారీ సమయంలో వర్షాలు ఎలాగూ పడలేదు, కనీసం నాట్లు వేసుకొనే సమయంలోనైనా వర్షాలు కురుస్తాయని అన్నదాతలు ఆశలు పెట్టుకున్నా నిరాశే మిగిలింది. జిల్లాలో చాలా మంది రైతులు నారుమళ్లు తయారు చేసుకోలేక పొలాలను బీళ్లుగా పెట్టుకొని బేల చూపులు చూస్తున్నారు.

జిల్లాలో ఈ ఏడాది 24 మండలాల్లో ఖరీఫ్‌లో 1.86 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగు చేయనున్నట్టు వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో 1.32 లక్షల ఎకరాల్లో వరి సాగు, మిగిలిన విస్తీర్ణంలో ఇతర పంటల సాగు జరుగుతుందని అధికారులు అంచనా వేశారు. అయితే ఇప్పటి వరకు వ్యవసాయాధికారుల గణాంకాల ప్రకారం కేవలం 2,990 హెక్టార్లలో



చీడికాడ మండలంలోని ఎన్.కొత్తూరులో నారుమడిని నీటి పైప్ ద్వారా తడుపుతున్న రైతు

మాత్రమే వరి నారుమడులు సిద్ధమయ్యాయి. అనకాపల్లి వ్యవసాయ డివిజన్ పరిధిలోని మండలాల్లో 8 హెక్టార్లలో నారుమడులు, చోడవరం డివిజన్‌లో 1,472 హె క్టార్లు, పాయకరావుపేట డివిజన్‌లో 1,075, నర్సీపట్నంలో 355, ఎలమంచిలి డివిజన్ పరిధిలోని మండలాల్లో 80 హెక్టార్లలో వరి నారుమళ్ల సిద్ధమయ్యాయి. తగిన వర్షాలు లేక మిగిలిన చోట్ల నారుమళ్ల ఇంకా తయారీ దశలోనే ఉన్నాయి. ఇవి కాకుండా కూరగాయల పంటలు, సజ్జ, రాగి, సామ తదితర పంటలు మరో 30 వేల హెక్టార్లలో సాగుకు అవకాశం ఉందని వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. వాస్తవానికి జిల్లాలో ఖరీఫ్ సాగు కాస్త ఆలస్యంగా జూలై రెండో వారానికి కనీసం పూర్తిస్థాయిలో వరి నారు మడులు అయినా తయారు చేసుకొనేవారు. కొన్ని మండలాల్లో నాట్లు పూర్తయ్యేవి. కానీ ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న రైతులు వ్యవసాయ పనులు చేపట్టడంలో వెనుకబడ్డారు.

తీవ్ర వర్షాభావం

ఈ ఏడాది జూన్ నెలలో 115.57 మిల్లీ మీటర్ల వర్షం కురవగా, జూలై నెలలో ఇప్పటి వరకు 42.46 మిల్లీ మీటర్లు వర్షం మాత్రమే కురిసింది. గత నెలలో అనుకున్న విధంగా వర్షాలు కురిసివుంటే వరి సాగు చేసే రైతులు ఇప్పటికే నారుమళ్లు సిద్ధం చేసుకొని ఉండేవారు. జూలై నెల మొదటి వారంలో కాస్త తేలికపాటి జల్లులు కురిసినా తరువాత రెండో వారం వచ్చేసరికి వాతావరణంలో పూర్తిగా మార్పులు చోటుచేసుకున్నాయి. అక్కడక్కడా చినుకులు పడినా కొద్ది సేపటికే ఎండ తీవ్రత పెరిగిపోతోంది. దీంతో జిల్లాలో పలు మండలాల్లో రైతులు పొలాలను బీళ్లుగా వదిలేసుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. అనకాపల్లి, చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, చీడికాడ, కె.కోటపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులు నారు మడులు వేసుకున్నా, వర్షాల కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. కొందరు తమ నారుమడులకు సమీపంలో బోర్లు నుంచి నీటిని తెచ్చి పోసి తడులు పెట్టుకొనేందుకు ఆపసోపాలు పడుతున్నారు. నర్సీపట్నం, మాకవరపాలెం, రోలుగుంట, నాతవరం, గొలుగొండ, ఎలమంచి, ఎస్.రాయవరం, నక్కపల్లి, కశింకోట, మునగపాక మండలాల్లో వరి సాగు చేసే రైతులు నారు మడులు తయారు చేసుకొనేందుకు వర్షాలు ఎప్పుడు పడతాయా? అని ఎదురు ... మిగతా 6వ పేజీలో

షుగర్ ఫ్యాక్టరీలకు పూర్వ వైభవం



గోవాడకు మంచి రోజులు

- ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుపై చంద్రబాబు ప్రకటనతో రైతాంగంలో చిగురిస్తున్న ఆశలు
- గోవాడ షుగర్స్‌కు కామధేనువులా మారనున్న ప్లాంట్
- పంచదార ఉత్పత్తి స్థానంలో ఇథనాల్ తయారీకి ప్రాధాన్యం
- చెరకు, ఇతర పంటల రైతాంగానికి కూడా చేకూరనున్న మేలు

చోడవరం, జూలై 13:

జిల్లాలో మూతపడిన షుగర్ ఫ్యాక్టరీలకు మంచి రోజులు రానున్నాయి. జిల్లా పర్యటన సందర్భంగా సీఎం చంద్రబాబు మూతపడిన సహకార షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించడంతో పాటు గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో తాండవ, ఏటికొప్పాక, తుమ్మపాల ఫ్యాక్టరీలు మూతపడగా, మిగిలిన ఏకైక గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సైతం ప్రభుత్వ ఆదరణ లేకపోవడంతో మూతపడే దశకు చేరింది. ఇటువంటి తరుణంలో షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని చంద్రబాబు హామీ ఇవ్వడంతో చెరకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మూతపడిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించడంతో పాటు వాటిని కేవలం పంచదార ఉత్పత్తికే పరిమితం చేయకుండా, ప్రత్యామ్నాయంగా ఇథనాల్ తయారీ ద్వారా ఫ్యాక్టరీలు స్వయం ఆర్థిక సమృద్ధిసాధించే విధంగా కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సీఎం చంద్రబాబు ప్రకటనతో గోవాడలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు ఖాయంగా కనిపిస్తోంది. పెట్రోల్‌లో ఇథనాల్ వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా చేయడంతో ఇథనాల్‌కు గిరాకీ పెరిగింది. కేవలం పంచదార ఉత్పత్తి వల్ల నష్టం తప్ప ఫ్యాక్టరీకి కానీ, రైతులకు కానీ ఎలాంటి లాభం ఉండకపోవడం వల్ల ఫ్యాక్టరీ, రైతుల మనుగడకు ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు ఒక్కటే మార్గమని గోవాడ ఫ్యాక్టరీని అధ్యయనం చేసిన నిపుణుల కమిటీ సైతం నివేదిక ఇచ్చింది. గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఇథనాల్ ప్లాంట్‌పై గత వైసీపీ ప్రభుత్వం కేవలం ప్రకటనలతోనే కాలక్షేపం చేసింది. షుగర్ ఫ్యాక్టరీలకు ఉద్దీపన పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల క్రితమే వడ్డీ లేని రుణాలతో పాటు ఇతర రాయితీలు ఇస్తామంటూ స్పష్టంగా హామీ ఇచ్చింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 30 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటిస్తూ తొలివిడతగా రూ.26 కోట్లు కేటాయించి, ప్లాంట్ ఏర్పాటు చేయకుండానే ఇచ్చిన నిధులు వెనక్కి తీసుకుని చెరకు రైతులకు టోకరా ఇచ్చింది.

గోవాడలో ఇథనాల్ ప్లాంట్‌కు అనుకూలతలు

గోవాడలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు అన్ని అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఫ్యాక్టరీకి ఆనుకుని శారదానది ప్రవహిస్తుండడం, ఏడాది పొడవునా చెరకు లేదా మొక్కజొన్న, ఇతర ... మిగతా 6వ పేజీలో

చెరకు రైతులకు ఇది వరం



గోవాడలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేయనుండడం రైతాంగానికి ఓ వరంలా భావిస్తున్నాం. చెరకుతో పాటు ఇతర పంటల వల్ల కూడా గిట్టుబాటు లేక చాలామంది సరుగుడు తోటలు వేసుకుంటున్నారు. ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుతో రైతులకు మద్దతు ధరలు లభించే అవకాశం ఉంది. ఫ్యాక్టరీ బాగుపడితే మాకంటే ఆనందపడేవారు ఎవరూ ఉండరు. ఇది రైతులకు మేలు చేకూరే నిర్ణయంగా భావిస్తున్నాం.

- మజ్జి గౌరీశంకరరావు, మాజీ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, చోడవరం

ఎట్టకేలకు గ్రోయిన్‌కు మోక్షం

ఐదేళ్ల క్రితం భారీ వర్షాలకు దెబ్బతిన్న ధర్మవరం అగ్రహారం గ్రోయిన్

- వృథాగా సముద్రంలో కలిసిపోతున్న సాగునీరు
- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- హోం మంత్రి అనిత చొరవతో సుమారు రూ.5 లక్షలతో మరమ్మతులు
- పది వేల ఎకరాలకు అందనున్న సాగునీరు
- సమస్య పరిష్కారం కావడంతో రైతుల ఆనందం



మరమ్మతులు చేయకముందు ధర్మవరం అగ్రహారం గ్రోయిన్ వద్ద ఇలా..

ఎస్.రాయవరం, జూలై 13:

మండలంలోని ధర్మవరం అగ్రహారం వద్ద వరహానదిలో ఉన్న గ్రోయిన్‌కు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీస మరమ్మతులకు నోచుకోని ఈ గ్రోయిన్‌కు కూటమి ప్రభుత్వం వచ్చాక మంచి రోజులు వచ్చాయి. హోం మంత్రి వంగలపూడి అనిత చొరవతో రైతులకు సాగునీటి సమస్య తీరింది.

ఐదేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు వరహానది ఉధృతంగా ప్రవహించడంతో ధర్మవరం అగ్రహారం వద్ద గ్రోయిన్ దెబ్బతింది. దీంతో సాగునీరు పంట పొలాలకు వెళ్లకుండా వృథాగా సముద్రంలో కలిసిపోతోంది. దీని వల్ల వెంకటాపురం, ఎస్.రాయవరం, సైతారుపేట, సర్వసిద్ధి, పేటసూదిపురం, వాకపాడు, వేమగిరి, లింగరాజుపాలెం, ఉప్పరాపల్లి తదితర గ్రామాలకు చెందిన సుమారు పది వేల ఎకరాల పంట భూములకు సాగునీరు అందక సంబంధిత రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను రైతులు పలుమార్లు విన్నవించుకున్నా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇటీవల ఎన్నికల ముందు ప్రచారానికి వచ్చిన వంగలపూడి అనిత దృష్టికి ఈ సమస్యను రైతులు తీసుకురావడంతో ఆదుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం రావడం, హోం మంత్రిగా ఆమె బాధ్యతలు చేపట్టిన తరువాత గ్రోయిన్ సమస్యపై దృష్టి పెట్టారు. టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం పర్యవేక్షణలో సుమారు రూ.5 లక్షల నిధులతో గ్రోయిన్‌కు ఇటీవల మరమ్మతులు చేయించారు. ఇప్పుడు వరహానదిలో సాగునీరు పంట పొలాల వైపు ప్రవహిస్తోంది. ఐదేళ్ల నుంచి సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు తమ సమస్య పరిష్కారం కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హోం మంత్రి అనిత వెంటనే గ్రోయిన్ మరమ్మతులు చేయించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టడంతో పంట పొలాల వైపు సాగునీరు ప్రవహిస్తున్న దృశ్యం

ఎస్పీగా ఎం.దీపిక

అనంతపురం ఎస్పీగా మురళీకృష్ణ బదిలీ



దీపిక



కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా ఎస్పీగా ఎం.దీపిక నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఎస్పీగా ఉన్న కేవీ మురళీకృష్ణను అనంతపురం ఎస్పీగా బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2023 ఏప్రిల్ 12న అనకాపల్లి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణ సార్వత్రిక ఎన్నికలను సమర్థంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించారు. ఆయన స్థానంలో విజయనగరం ఎస్పీగా చేస్తున్న దీపికను ఇక్కడ నియమించారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఆమె 2021 జూలై నుంచి మూడేళ్లుగా విజయనగరం ఎస్పీగా పని చేశారు.

ఏయూలో అక్రమాలపై విచారణకు మీనమేషాలు

రెండు వారాల క్రితం వీసీ ప్రసాదరెడ్డి రాజీనామా

- ఆయన హయాంలో అనేక అవకతవకలు, అడ్డగోలు నియామకాలు జరిగాయని ఆరోపణలు
- ఇప్పటివరకూ ఆ దిశగా దృష్టిపెట్టని పాలకులు



ప్రసాదరెడ్డి

- ఇన్‌చార్జి వీసీ నియామకంలోనూ జాప్యం
- లక్ష్మీపార్వతికి ప్రొఫెసర్‌షిప్‌పై స్పందించని ఇన్‌చార్జి రిజిస్ట్రార్
- మరోవైపు ప్రొఫెసర్ బాధ్యతలకు దూరంగా ప్రసాదరెడ్డి
- వర్సిటీకి హాజరుకాని వైనం

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని కొత్త ప్రభుత్వం ప్రక్షాళన చేస్తుందని భావిస్తున్న వారికి నిరాశే మిగులుతోంది. వైస్ ఛాన్సలర్‌గా ప్రసాదరెడ్డి చేసిన అరాచకాలపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటారని అంతా అనుకున్నారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా ఇప్పటివరకూ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యపరుస్తోంది. పైగా ప్రసాదరెడ్డి వెళ్లేముందు తనకు అనుకూలంగా ఉండే వ్యక్తికే ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పదవి కట్టబెట్టారు. ఆయన ఏ విషయంపైనా నోరుమెదపడం లేదు.

ప్రసాదరెడ్డి రాజీనామా చేసి రెండు వారాలు అవుతున్నా ఇప్పటివరకూ ఇన్‌చార్జి వీసీని నియమించలేదు. మరోవైపు ప్రసాదరెడ్డి రాజీనామా ఇంకా ఆమోదం పొందలేదని ప్రచారం జరుగుతోంది. అందుకే ఆయన యూనివర్సిటీకి రావడం లేదని అంటున్నారు. వాస్తవానికి వీసీ పదవికి రాజీనామా చేసిన తరువాత ఆయన కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్‌గా విధులకు హాజరుకావాలి. కానీ జూలై నెలలో ఆయన ఇప్పటివరకూ ఒక్కరోజు కూడా విధులకు రాలేదు. రిజిస్టర్‌లో మిగిలిన ప్రొఫెసర్లు అంతా సంతకాలు చేస్తున్నా ఆయన పేరున్నచోట ఖాళీయే ఉంది.



యూనివర్సిటీలోని టీడీఆర్ (ట్రాన్స్-డిసిప్లినరీ రీసెర్చ్) హబ్‌లో వైసీపీ నాయకురాలు లక్ష్మీపార్వతికి ప్రొఫెసర్‌షిప్ ఇచ్చారు. ఇది జరిగి మూడేళ్లయింది. ఆమెకు పది మంది పరిశోధకులను అప్పగించారు. ఆమెకు ... మిగతా 6వ పేజీలో

ఫార్మా పరిశ్రమలకు నోటీసులు ఇచ్చాం

- పీసీబీ ఈఈ ముకుందరావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పరవాడ, జూలై 13: ఫార్మాసిటీలోని అన్ని పరిశ్రమలకు నోటీసులు జారీ చేశామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) ఈఈ పీవీ ముకుందరావు తెలిపారు. పరవాడ నుంచి అనకాపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలోని భరిణికం మల్లోడి గెడ్డలో ఫార్మా వ్యర్థ రసాయనాలను విడిచిపెట్టడంతో ఆ ప్రాంతమంతా వ్యర్థాలతో నిండిపోయింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల 'ఫార్మా యాజమాన్యాల ఇష్టారాజ్యం' శీర్షికన కథనం వెలువడడంతో పీసీబీ అధికారులు స్పందించారు. మల్లోడి గెడ్డ నీటిలోని నమూనాలను సేకరించారు. ల్యాబ్‌లో పరీక్షల అనంతరం ఫార్మా వ్యర్థ జలాలు గెడ్డలో కలిసినట్టు నిర్ధారణ అయ్యిందని పీసీబీ ఈఈ ముకుందరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. భవిష్యత్తులో రసాయన వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టకుండా ఫార్మాసిటీలోని అన్ని పరిశ్రమలకు శనివారం నోటీసులు జారీ చేసినట్టు ఆయన చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా ఫార్మా వ్యర్థాలను బయటకు విడిచిపెడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే ఫార్మా వ్యర్థాలను బయటకు తరలించకుండా రాంకీ చెక్‌పోస్టుల వద్ద మరింత నిఘా పెంచుతామన్నారు. పెదముషిడివాడ బచ్చల చెరువులో ఫార్మా వ్యర్థాల డ్రమ్ములను విడిచిపెట్టిన ఉదంతంపై పోలీసులు విచారణ జరుపుతున్నారని ఆయన వెల్లడించారు.

అగ్నిమాపక సిబ్బంది ఆకలి కేకలు

20 నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు



నక్కపల్లి అగ్నిమాపక సిబ్బంది

నక్కపల్లి, జూలై 13: నక్కపల్లి అగ్నిమాపక కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి సుమారు 20 నెలల నుంచి జీతాలు అందడం లేదు. దీంతో వారు కుటుంబపోషణ కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. జీతాలు రేపు, మాపు ఇస్తామంటూ కాంట్రాక్టర్ 20 నెలలుగా కాలం గడిపేస్తున్నాడు. నక్కపల్లి అగ్నిమాపక కేంద్రంలో 16 మంది అగ్నిమాపక సిబ్బంది అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్నారు. వీరిలో ఇద్దరు డ్రైవర్లు కాగా, మిగతా వారు ఫైర్‌మెన్‌లు. తమకు 2022 డిసెంబరు నుంచి జీతాలు ఇవ్వలేదని ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది చెప్పారు. వాస్తవానికి విపత్తు నిర్వహణ సంస్థ అగ్నిమాపక సిబ్బందికి ఎంత జీతం ఇస్తుందో వీళ్లకు ఇప్పటికీ తెలియదు. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్ట్ సంస్థ మాత్రం వీరికి తక్కువ వేతనాలే ఇస్తోంది. నెలకు ఒక్కొక్కరికీ రూ.6,500 జీతం ఇస్తున్నారు. ఈ జీతం కూడా 20 నెలల నుంచి ఇవ్వకపోవడంతో వారంతా అప్పులు చేసి కుటుంబాలను పోషిస్తున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వం తమను రెగ్యులర్ చేస్తుందన్న ఆశతో వీరంతా తక్కువ జీతాలకు పనిచేస్తూ, అవి కూడా సకాలంలో ఇవ్వకపోవడంతో నరకయాతన పడుతున్నారు. నక్కపల్లి అగ్నిమాపక కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది నర్సీపట్నం, అనకాపల్లి పరిసర ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. దీనిపై ఇన్‌చార్జి అగ్నిమాపకాధికారి రాంబాబు వివరణ కోరగా ఇటీవలే సీఎం చంద్రబాబుకు సిబ్బంది వారి సమస్యలపై వినతిపత్రం ఇచ్చారని చెప్పారు. కాంట్రాక్ట్ సంస్థ జీతాలు ఇవ్వాల్సి ఉందన్నారు.

నర్సీపట్నంలో చెత్త నిర్వహణ అధ్వానం

- మరమ్మతులకు గురైన కంపాక్టర్, ఎక్స్‌కవేటర్
- వినియోగంలోకి రాని కంపోస్ట్ యార్డు
- డింపింగ్ యార్డుకు రోడ్డు సౌకర్యం లేక అవస్థలు
- పట్టించుకోని పాలకవర్గం, ఉన్నతాధికారులు

తడి, పొడి చెత్త నిర్వహణ అస్తవ్యస్తం



డంపింగ్ యార్డులో కూరుకు పోయిన చెత్త ట్రాక్టర్

నర్సీపట్నం, జూలై 13: మునిసిపాలిటీలో చెత్త నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. వార్డులు, ప్రధాన రహదారులు చెత్తకుప్పలతో నిండిపోయాయి. దుర్గంధం, దోమల బెడదతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఊరంతా కంపు కొడుతున్నా గత పాలకవర్గం పట్టించుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి. డింపింగ్‌కు రోడ్డు లేక ట్రాక్టర్లతో చెత్తను తరలించడం లేదు. చెత్త సమస్యపై కౌన్సిల్ సమావేశంలో అధికార, విపక్ష కౌన్సిలర్లు ప్రతీ నెలా అధికారులను నిలదీస్తున్నా ప్రయోజనం ఉండడం లేదు. నర్సీపట్నంలోని ప్రధాన కూడళ్లలో డంపర్ బిన్లు చెత్తతో నిండిపోయినా తొలగించడం లేదు. కాంపాక్టర్, ఎక్స్‌కవేటర్ మరమ్మతులకు గురైనా వాటికి మరమ్మతులు చేయించడం లేదు.

నిరుపయోగంగా కంపోస్ట్ యార్డు

2016 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అయ్యన్నపాత్రుడు చొరవతో బలిఘట్టంలోని వరహానదిని ఆనుకొని సాలిడ్ వేస్ట్ మేనేజ్ పార్కు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. దీనికి రూ.1.5 కోట్లు 13వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పథకంలో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేయాలి. ఈ కంపోస్టు యార్డు నిర్వహణ బాధ్యతలను 2017 ఆగస్టులో క్యూబ్ బయో ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు అప్పగించారు. ఈ సంస్థతో చేసుకున్న ఒప్పందం మేరకు ప్రతీ రోజు 14 నుంచి 16 టన్నుల తడి చెత్తను క్యూబ్ బయో ఎనర్జీ సంస్థకు అప్పగించాలి. అయితే వార్డులలో డోర్ టు డోర్ తడి, పొడి చెత్త సేకరణ జరగకపోవడంతో క్యూబ్ బయో ఎనర్జీ సంస్థకు పూర్తిస్థాయిలో చెత్తను సరఫరా చేయలేకపోతున్నారు. అదే విధంగా పొడి చెత్త నుంచి పేపర్లు, పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్, గాజు పెంకులు వేరు చేసి మిగిలిన వ్యర్థాలను కాపులుప్పాడలో ఉన్న విద్యుత్ తయారీ కేంద్రానికి తరలించాలి. వారానికి 30 టన్నులు పొడి చెత్త తరలించడానికి విజయవాడకు చెందిన తరుణి అసోసియేట్స్ సంస్థకు రెండేళ్ల క్రితం కాంట్రాక్ట్ ఇచ్చింది. అయితే డంపింగ్ యార్డులో రోడ్డు సౌకర్యం లేక సదరు సంస్థ చేతులెత్తేసింది. దీంతో రోజు రోజుకి డంపింగ్ యార్డులో చెత్త కొండలా పేరుకు పోయింది. వర్షం పడితే బురదలో చెత్త ట్రాక్టర్లు కూరుకు పోతున్నాయి. ట్రాక్టర్ దిగిబడిన చోటే చెత్తను వేసేస్తున్నారు. డంపింగ్ యార్డులోకి ఎక్స్‌కవేటర్ టైర్లు బురదలో కూరుకుపోతున్నాయి. చైన్ ఎక్స్‌కవేటర్ అద్దెకు తీసుకొని డంపింగ్ యార్డులో రోడ్డు మార్గం శుభ్రం చేయడానికి రూ.2 లక్షలతో చేసిన ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో డంపింగ్ యార్డులోకి చెత్త తరలించడానికి వీలు లేక, మరోచోట డంపింగ్ చేసే అవకాశం లేక మెయిన్ రోడ్డులో ఎక్కడ చెత్తను అక్కడే వదిలేస్తున్నారు.

తడి, పొడి చెత్త సేకరణ శూన్యం

నర్సీపట్నం మునిసిపాలిటీలోని 28 వార్డుల్లో తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేర్వేరుగా అందించడానికి ప్రతీ ఇంటికి మూడు డస్ట్‌బిన్‌లు చొప్పున 60 వేలు ప్లాస్టిక్ డబ్బాలు పంపిణీ చేశారు. దీనికి రూ.31.58 లక్షలు ఖర్చు చేశారు. కంపోస్ట్ యార్డు వినియోగంలో లేక నిధులు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయింది. డోర్ టు డోర్ తడి,పొడి చెత్త సేకరణ జరగడం లేదు. టీడీపీ హయాంలో మంజూరు చేసి ట్రాక్టర్లు, వ్యాన్లు మాత్రమే ఉన్నాయి. ఇందులో రెండు ట్రాక్టర్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. తర్వాత ట్రాక్టర్లు కొనుగోలు చేయలేదు. ప్రస్తుతం మూడు అద్దె ట్రాక్టర్లతో చెత్త తోలుతున్నారు. ప్రస్తుతం ఉన్న జనాభాకు సరిపడా పారిశుధ్య కార్మికులు లేక చెత్త సేకరణ పూర్తి స్థాయిలో చేయలేకపోతున్నామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు అంటున్నారు.



డంపింగ్ యార్డులో అధ్వానంగా ఉన్న రహదారి

విద్యుదాఘాతంతో గిరిజనుడి మృతి



రాజుబాబు (ఫైల్)

చింతపల్లి, జూలై 13: మండలంలోని చిన్నరాజుపాకలు గ్రామంలో ఓ గిరిజనుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. మూడు రోజులుగా చిన్నరాజుపాకలు గ్రామానికి విద్యుత్ సరఫరా లేదు. దీంతో గ్రామస్థులు లంబసింగి ఈపీడీసీఎల్ లైన్‌మన్‌కి ఫోన్ చేశారు. వర్షాలు కురుస్తుండడం, విద్యుత్ తీగలకు సమీపంగా తుప్పలు అధికంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతాయని విద్యుత్ సరఫరా నిలిపివేశామని లైన్‌మన్ సమాధానం ఇచ్చాడు. శనివారం 33 కేవీ విద్యుత్ లైన్ నిర్వహణ పనుల కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఇంజనీరింగ్ అధికారులు ప్రకటించారు. దీంతో చిన్నరాజుపాకలు గ్రామానికి చెందిన గిరిజనులు విద్యుత్ తీగలపై ఉన్న మొక్కల పొదులను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని నిర్ణయించుకుని పనులు ప్రారంభించారు. విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ముందుగా ప్రకటించిన ఈపీడీసీఎల్ ఇంజనీరింగ్ అధికారులు వర్షం కారణంగా పనులు చేపట్టలేమని సుమారు 10 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో పొదులు తొలగిస్తున్న చిన్నరాజుపాకలు గ్రామానికి చెందిన రుత్తల రాజుబాబు(52) విద్యుదాఘాతానికి గురై కిందకు పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కుటుంబ సభ్యులు తరలించారు. అయితే అప్పటికే రాజుబాబు ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ ఘటనపై చింతపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

కణుజు మాంసంతో ముగ్గురి అరెస్టు

- మరో ముగ్గురు పరారీ

మాకవరపాలెం, జూలై 13: మండలంలో ఎరకన్నపాలెంలో కణుజు మాంసంతో ముగ్గురు వ్యక్తులను పట్టుకొని అరెస్టు చేశామని నర్సీపట్నం రేంజ్ ఆఫీసర్ లక్ష్మీనర్సు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. మండలంలో రాచపల్లి శివారు ఎరకన్నపాలెంలో వన్యప్రాణి కనుజును కొందరు వేటాడారు. శనివారం ఉదయం కణుజు మాంసం విక్రయిస్తుండగా సమాచారం తెలుసుకున్న నర్సీపట్నం రేంజ్ ఆఫీసర్ లక్ష్మీనర్సు తన సిబ్బందితో దాడి చేశారు. 30 కిలోల కణుజు మాంసంతో పాటు అడిగర్ల రాజు, కొల్లునూకరాజు, కొల్లు రామారావు అనే ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఎ.రాజు, రావాడ సాయితో పాటు మరో వ్యక్తి పరారయ్యారు. వారి కోసం గాలిస్తున్నామని రేంజర్ తెలిపారు.

350 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

పెదబయలు, జూలై 13: అడుగులపుట్టు కూడలిలో 350 కిలోల గంజాయితో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ముందస్తు సమాచారంతో శనివారం సిబ్బందితో ఎస్ఐ అడుగులపుట్టు కూడలిలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. నిందితులు జి.మాడుగుల మండలం కుంబిడిసింగి పంచాయతీ గద్దేరాయి గ్రామానికి చెందిన జగ్గందొర గోపాలస్వామి, జగ్గందొర వెంకటరమణ, గొల్లోరి హరిప్రసాద్‌గా గర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, ఆ ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



భారపు సాయికృష్ణ (ఫైల్)

కొత్తూరు, జూలై 13: మునగపాక మండలం ఉమ్మలాడ పంచాయతీలో మతిస్థిమితం లేని యువకుడు శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్టు మునగపాక ఇన్‌చార్జి ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపారు. ఉమ్మలాడ పంచాయతీ ముత్రాసుకాలనీకి చెందిన భారపు సాయికృష్ణ (26)కు కొద్దికాలంగా మతిస్థిమితం సరిగ్గా ఉండేది కాదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 12వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సాయికృష్ణ అక్క అనపర్తి జయ పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు. మృతదేహానికి అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఆయన తెలిపారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం



దుర్గా ప్రసాద్(ఫైల్)

ఎలమంచిలి, జూలై 13: మునిసిపాలిటీలోని శేషకొండ కాలనీలో ఒక యువకుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు పట్టణ ఎస్ఐ పాపినాయుడు తెలిపారు. శేషకొండ ప్రాంతానికి చెందిన దమ్ము దుర్గాప్రసాద్(27) భార్యతో కొంతకాలంగా దూరంగా ఉంటున్నాడన్నారు. తన భార్య కాపురానికి రాలేదని మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పాపినాయుడు తెలిపారు.

న్యాయ విద్యలో సమూల మార్పులు

- న్యాయ నిపుణులకు మెండుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె మన్మథరావు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావును సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు

సబ్బవరం, జూలై 13: జాతీయ స్థాయిలో న్యాయ విశ్వవిద్యాలయాల స్థాపనతో న్యాయవిద్యలో సమూల మార్పులు చోటుచేసుకున్నాయని, న్యాయాన్ని అధ్యయనం చేసే విధానం మారిందని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు అన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మొదటి సంవత్సరం ప్రవేశం పొందిన విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జస్టిస్ మన్మథరావు ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. న్యాయ విద్యను పూర్తి చేసివారికి అనేక ఉద్యోగ, ఉపాధి అవ కాశాలు లభిస్తున్నాయన్నారు. మీడియేషన్, ఆర్బిట్రేషన్, మారిటైం, ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్‌లో వివిధ కార్పొరేట్ సంస్థల ద్వారా అనేక అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అనేకమంది న్యాయ విద్య పట్ల ఆకర్షితులవుతున్నారన్నారు. వర్సిటీలు కూడా అంతే ప్రాధాన్యతతో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషిచేస్తున్నాయని చెప్పారు. దేశంలో న్యాయ నిపుణుల అవసరం ఎంతో ఉందన్నారు. గ్రాడ్యుయేషన్ తరువాత ఎక్కువ మంది లైటిగేషన్ వైపు కాకుండా కార్పొరేట్ రంగాల వైపు వెళుతున్నారని, అందువల్ల క్షేత్ర స్థాయిలో న్యాయ నిపుణుల కొరత వస్తుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ఎక్కువ మంది సామాజిక బాధ్యతను నిర్వర్తించేందుకు లోకల్ కోర్టులలో కొంతకాలం ప్రాక్టీసు చేసినట్టయితే ట్రయిల్ కోర్టు అనుభవం రావడంతో పాటు ఎక్కువ మంది లాయర్లు అందుబాటులోకి వస్తారన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ.. న్యాయ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. జస్టిస్ మన్మథరావు న్యాయ శాస్త్రంలో పరిశోధన చేశారని, ఇంకా కొనసాగిస్తున్నారని, ఆయన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావును వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ నందిని సీపీ, అకాడమిక్ డీన్ సోమా భట్టాచార్య, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

పదేళ్లుగా పెంచిన చెట్లను విద్యుత్ సిబ్బంది నరికివేయడంపై విమర్శలు



మంచాల ఊరచెరువు గట్టుపై ఉన్న చెట్లను నరికి వేసిన విద్యుత్ సిబ్బంది

చీడికాడ, జూలై 13: పదేళ్లుగా పెంచుతున్న చెట్లను విద్యుత్ శాఖ సిబ్బంది అర్థాంతరంగా నరికివేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంచాల ఊరచెరువు గట్టు నుంచి ఎం.గదబూరు వరకు రోడ్డుకు ఇరువైపులా ఉపాధి పథకం ద్వారా పది సంవత్సరాల క్రితం మొక్కలు వేశారు. వాటి సంరక్షణకు నీటి తడుపులు, కంచె పెట్టడానికి లక్షలాది రూపాయలు ఖర్చుచేశారు. ఊరచెరువు గట్టుపై ఉన్న తారురోడ్డుకి ఇరువైపులా సుమారు 50 చెట్లు ఉన్నాయి. అయితే చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగిలి తరచూ మంచాల గ్రామానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని విద్యుత్‌శాఖ అధికారులు చెరువువైపు ఉన్న చెట్లను మొదళ్లకే నరికివేశారు. ప్రభుత్వ నిధులతో విద్యుత్ స్తంభాల కింద మొక్కలు వేయడం ఎందుకు, వాటిని నరికివేయడం ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ నమ్మి వెంకటరావును వివరణ కోరగా, చెట్టుకొమ్మలు విద్యుత్ తీగలకు తగలడంతో తరచూ విద్యుత్‌కి అంతరాయం ఏర్పడుతోందని, దీంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు చెట్లను మధ్యలో నరికివేశామని, మళ్లీ అవి చిగురిస్తాయని చెప్పారు. ఈ విషయమై ఉపాధి హామీ పథకం ఏపీవో సియ్యాద్రి నాగరాజును వివరణ కోరగా ఉపాధి పథకం వీఆర్పీలు కష్టపడి లక్షలాది రూపాయలు ప్రభుత్వ నిధులతో చెట్లను పెంచితే కనీసం విద్యుత్‌శాఖ అధికారులు ఎంపీడీవో అనుమతి కూడా తీసుకోకుండా నరికి వేయడం ఏమిటని, దీనిపై ఎంపీడీవోకి ఏఈపై ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

కోడి మెడ కొరికేసిన డ్యాన్సర్‌పై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, జూలై 13: వేదికపై డ్యాన్స్ చేస్తూ అతి దారుణంగా కోడి మెడ కొరికిన వ్యక్తిపై అనకాపల్లి పట్టణ పోలీసులు కేసు నమోదుచేసిన విషయం ఆలస్యంగా తెలిసింది. డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమంలో చోటుచేసుకున్న ఈ సంఘటనపై క్రూయల్టీ రెస్పాన్స్ కో-ఆర్డినేటర్ సించాన సుబ్రహ్మణ్యస్ మెయిల్ ద్వారా జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తాను ఇన్‌స్టాగ్రామ్‌లో చూసిన ఆ వీడియోను మెయిల్ ద్వారా ఎస్పీకి పంపించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ ఆఫ్ యానిమల్స్ యాక్టు కింద ఈ నెల ఆరో తేదీన పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ సంఘటన అనకాపల్లిలో జరిగినట్టు ఫిర్యాదు దారుడు పేర్కొన్నారు.

అది విష్ణు ఈవెంట్స్ కళాకారుల ప్రదర్శనగా వీడియో ఆధారంగా గుర్తించినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. అయితే ఆ సంస్థ ఏ ప్రాంతానికి చెందినది, సంఘటన ఎక్కడ జరిగిందీ విచారణ జరుపుతున్నారు. కేసును ఎస్ఐ వీవీ రమణ దర్యాప్తు చేస్తున్నారు.

'విరాళం డబ్బులు గుడి నిర్మాణానికే ఖర్చు చేశాం'

నర్సీపట్నం, జూలై 13: నూకాంబికా అమ్మవారి ఆలయం నిర్మాణానికి సీఎంఆర్ అధినేత ఇచ్చిన రూ.10 లక్షలు గుడి నిర్మాణానికి ఖర్చు చేశామని ఆలయ చైర్మన్ దనిమిరెడ్డి నాగు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు దేవదాయ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో విరాళంగా ఇచ్చిన డబ్బులు ఏమయ్యాయని ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఆలయ గోపురం, విగ్రహాలు, శాలాహారం తయారు చేయించడానికి రూ.9 లక్షలు దఫదఫాలుగా ఖర్చు చేశామని చైర్మన్ దనిమిరెడ్డి నాగు తెలిపారు. శిల్పికి రూ.7.4 లక్షలు, ఇసుక, ఇటుకలు, సిమెంటుకు రూ.1.6 లక్షలు స్వయంగా తాను ఖర్చు చేశానని ఆ ప్రకటనలో తెలిపారు.

30 రోజుల్లో అద్భుతమైన పాలన

- మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, జూలై 13 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 30 రోజుల్లోనే అద్భుతమైన పాలన అందించిందని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారన్నారు. ప్రధానంగా మెగా డీఎస్సీ, వృద్ధాప్య పింఛన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, అన్న క్యాంటీన్ల పునః ప్రారంభం, ఉచిత ఇసుక తదితర హామీలను నెరవేర్చిన ఘనత చంద్రబాబునాయుడుదేనన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, ఎర్ర చందనం లాంటి స్మగ్లింగ్ కార్యక్రమాలకు కట్టడి చేస్తూ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. భవిష్యత్తులో రాష్ట్రాన్ని అభివృద్ధిబాటలో పరుగులు తీయించేందుకు ప్రణాళికలు రూపొందించబడుతున్నాయన్నారు.

రక్తమోడిన రహదారి

- పారిశ్రామిక ప్రాంతంలో రెండుచోట్ల జరిగిన ప్రమాదాల్లో ముగ్గురి మృతి
- పాత గాజువాకలో తల్లీకూతుళ్లు మృత్యువాత
- అగనంపూడిలో వివాహిత..

గాజువాక, జూలై 13: పారిశ్రామిక ప్రాంతంలో వేర్వేరుగా రెండు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. పాత గాజువాకలో తల్లీకూతుళ్లు, అగనంపూడి కూడలిలో ఓ వివాహిత మృతి చెందారు. ఆయా సంఘటనలకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

అగనంపూడి సమీపంలోని దానబోయినపాలేనికి చెందిన జాజుల సూరిబాబు అనే వ్యక్తి భార్య జాజుల పార్వతి (55), కుమార్తె పి.సత్యవతి (26), మనవడు పార్థులతో కలిసి ద్విచక్ర వాహనంపై శనివారం ఉదయం వేపగుంట వద్దనున్న ఓ ఆస్పత్రికి వచ్చి సాయంత్రం ఇంటికి తిరిగి బయలుదేరారు. ఈ క్రమంలో పాత గాజువాక కూడలి సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి ఓ లారీ బలంగా వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో పార్వతి, సత్యవతి లారీ చక్రాల కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సూరిబాబు, పార్థులు మరోవైపు పడిపోవడంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. తన కళ్లెదుటే భార్య, కుమార్తె కానరాని లోకాలకు తరలిపోవడంతో సూరిబాబు బోరున విలపిస్తూ రోడ్డుపైనే సొమ్మసిల్లి పడిపోయారు. ప్రమాద సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తల్లీకూతుళ్ల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగనంపూడిలో వివాహిత..

కూర్మన్నపాలెం: అగనంపూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వివాహిత మృతి చెందింది. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చోడవరం మండలం గోవాడకు చెందిన సరకాన రేవతి తన భర్త సతీశ్‌తో కలిసి బైకుపై తమ అమ్మ వాళ్లింటికి గాజువాక సమీపంలోని మింది గ్రామానికి బయలుదేరింది. ఈ క్రమంలో అగనంపూడి జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఓ లారీ అతి వేగంతో వచ్చి వెనుక నుంచి వీరి బైకును ఢీకొంది. దీంతో బైకు వెనుక కూర్చున్న రేవతి కింద పడడంతో ఆమె చేతి మీదుగా లారీ ముందుకు పోయింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు కూడా తీవ్ర గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందింది. తన కళ్లెదుటే భార్య మృత్యువాత పడడంతో సతీశ్ బోరుమని విలపించారు. సమాచారం అందుకున్న దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రేవతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. లారీ డ్రైవరును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రేవతి, సతీశ్‌లకు నాలుగేళ్ల క్రితం వివాహమవ్వగా, వీరికి భవ్యేశ్, నేహాల్‌కుమార్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. సతీశ్ ఫార్మాసిటీలో లారస్ ల్యాబ్‌లో కెమిస్టుగా పని చేస్తున్నారు.

'అటల్ టింకరింగ్'పై డీఈవో సమీక్ష

కొత్తూరు, జూలై 13: అనకాపల్లి జిల్లాలో అటల్ టింకరింగ్ ల్యాబ్ పనితీరు, మార్గదర్శకాలపై జిల్లా జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ శనివారం సమీక్షించారు. పట్టణంలోని జీవీఎంసీ పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లలో 13 సూచికలు, పనితీరు, వాటిని ఆశించిన రీతిలో ఎలా సాధించాలో వివరించారు. అంతేగాకుండా విద్యార్థులు ప్రాజెక్టులు ఏ విధంగా రూపొందించాలనే అంశాలపై మార్గనిర్దేశం చేశారు. అనంతరం జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, ఏఎంవో మురళీమోహన్ పట్నాయక్, జిల్లా సైన్స్ అధికారి డి. కాళిదాసు పర్యవేక్షించి పాఠశాలల పనితీరు జాబితాను అందించారు. ఈ సమావేశంలో జిల్లాలోని 30 అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రామావతారంలో జగన్నాథుడు



రామావతారంలో జగన్నాథస్వామి

అనకాపల్లి టౌన్, జూలై 13: స్థానిక గూడ్స్‌షెడ్డు వద్ద గల ఇంద్రజ్యుమ్నా హాల్‌లో కొలువై ఉన్న సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి శనివారం భక్తులకు రామావతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

మురుగు కదలదు.. దుర్వాసన వదలదు

వైసీపీ ఐదేళ్ల నిర్వాకం నేడు పల్లె నుంచి పట్టణాల వరకు మురుగు ఓ ప్రధాన సమస్యగా మారింది. పంచాయతీలకు ప్రజల నుంచి వివిధ రూపాల్లో వచ్చిన నిధులతో పాటు ఆర్థిక సంఘం ద్వారా విడుదలైన మొత్తాన్ని సైతం సదరు పాలకులు పక్కదారి పట్టించడంతో నేడు అంతటా దుర్గంధ భరిత వాతావరణం నెలకొంది. అసలే వర్షాకాలం.. ఆపై అంటు వ్యాధులు ప్రబలే అవకాశం.. ఈ పరిస్థితుల్లో వీధివీధిన దోమలు విజృంభిస్తుండడంతో కంటిమీద కునుకువుమాట అటుంచితే.. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటివి ఎక్కడ సోకుతాయోనని జనం హడలిపోతున్నారు.

- ఐదేళ్ల వైసీపీ నిర్వాకంతో పల్లెల్లో నేడు ప్రత్యక్ష నరకం
- పంచాయతీలకు వచ్చిన నిధులు పక్కదారి
- అభివృద్ధిపై చేతులెత్తేసిన పాలకులు
- ఎక్కడికక్కడ నిలిచిపోతున్న వాడుక నీరు
- మురుగుగా మారుతుండడంతో ఓ పక్క దోమల బెడద.., మరో పక్క అంటువ్యాధుల భయం..

నూతనగుంటపాలెంలో...



రామకోవెల వీధి కూడలి వద్ద మురుగునీటిని చూపుతున్న మహిళలు

కశింకోట, జూలై 13 : అంటువ్యాధులు ప్రబల కుండా పరిసరాల పరిశుభ్ర పాటించాలంటూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఊదరగొట్టి అధికారులు, ప్రజాప్రతినిధులు... పల్లెల్లో పారిశుధ్య సమస్యపై మాత్రం దృష్టి సారించలేకపోయారు. ఫలితంగా నేడు ఏ వీధి చూసినా మురుగు మయంగా కనిపిస్తుంది. ఇందుకు కశింకోట మండలంలోని నూతనగుంటపాలేన్ని ఓ ఉదాహరణగా చెప్పవచ్చు. ఇక్కడ పలు పురవీధుల్లో నిల్వ ఉన్న మురుగు నీటిని శుభ్రం చేయడంలో పంచాయతీ అధికారులు విఫలమయ్యారు. అంతేకాకుండా వర్షం వస్తే మురుగుతో పాటు వర్షపు నీరు ఇళ్ల ముందు తిష్ట వేస్తోంది. కొన్నిచోట్ల రోడ్లపైకి చేరుతోంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనివల్ల గ్రామంలో దోమలు బెడద అధికమైందని వాపోతున్నారు. దుర్వాసన కారణంగా అంటువ్యాధుల భయం వెంటాడుతోందని ఆందోళన చెందుతున్నారు. ఇదిలావుంటే, గ్రామంలో పంచాయతీ పైపులైన్లు పూర్తిగా నాచుపట్టాయి. ట్యాపులు దెబ్బతినడంతో లీకేజీల కారణంగా తాగునీరు వృథాగా పోతోంది. ఈ సమస్యను పంచాయతీ దృష్టికి తీసుకు వెళ్లినా స్పందించలేని దుస్థితిలో ఉండేవారని అంటున్నారు. కొత్త ప్రభుత్వమైనా మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.



కొత్తూరువూరు వీధిలో..

పారిశ్రామిక ప్రాంతం అచ్యుతాపురంలో...



అచ్యుతాపురం- వెదురువాడ పంచాయతీల పరిధిలోని ఓ ప్రాంతంలో రోడ్డుపై పారుతున్న మురుగు

అచ్యుతాపురం, జూలై 13 : అపార్టుమెంట్లలో నివాసితులు వాడిన నీరు బయటకు వెళ్లే మార్గంలేక రోడ్లపైనే ప్రవహిస్తుండడంతో అచ్యుతాపురం వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అచ్యుతాపురంతో పాటు వెదురువాడ పంచాయతీలు కలిసే ఉంటాయి. ఎలమంచిలి రోడ్డులోని వెదురువాడ పంచాయతీ పరిధిలో గల అపార్టుమెంట్లలో నివశిస్తున్నవారు వాడిన నీరు బైయటకుపోయే మార్గంలేక రోడ్లపైనే పారుతోంది. సాయిసదన్ అపార్టుమెంట్‌లో సుమారు యాభై కుటుంబాలు ఉంటున్నాయి. వీరు వాడిన నీరు రోడ్డుపైకి చేరుతోంది. దీంతో పక్కనే ఓ గోతిలో నిల్వ ఉండి మురుగుగా మారుతోంది. ఫలితంగా ఇటుగా రాకపోకలు సాగించేవారు ముక్కుమూసుకొని వెళ్లవలసి వస్తోంది. దీని పక్కనే ఉన్న మరో అపార్టుమెంటు నుంచి వాడుక నీటి పైప్‌ని నేరుగా రోడ్డుపైకి వదిలేశారు. దీంతో రైడ్డుపైకి ఆ నీరుచేరి నాచుపడుతోంది. ఈ కారణంగా దోమలు విజృంభించడంతో పాటు దుర్వాసన వెదజల్లుతోందని అంటున్నారు. ఈ సమస్య గతంలో పంచాయతీ అధికారుల దృష్టికి వెళ్లినా వైసీపీ ప్రభుత్వ నిర్వాకం కారణంగా నిధులు లేక అధికారులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. ప్రస్తుత పాలకులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.



అపార్టుమెంటు నుంచి వీధి రోడ్డుపైకి చేరిన వాడుక నీరు

ఉపమాక వెంకన్నకు ప్రత్యేక పూజలు



నక్కపల్లి, జూలై 13 : ఉపమాక వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత కొండపై ఉన్న స్వామి నిజరూపానికి అర్చకులు పంచామృతాభిషేకం చేసిన అనంతరం భక్తులను దర్శనభాగ్యం కల్పించారు. కింద ఆలయంలో ఉభయదేవేరులతో కూడిన స్వామి వారిని పట్టుపీతాంబరాలు, పుష్పమాలలతో అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

జీతాల కోసం వైద్య సిబ్బంది రిలే దీక్షలు



రిలే దీక్షలో కూర్చున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి టౌన్, జూలై 13 : ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద మత్తు వ్యసన విముక్తి కేంద్రంలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది శనివారం రిలే దీక్షలు చేపట్టారు. తమకు రావాల్సిన 12 నెలల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ దీక్షల్లో డాక్టర్ కృష్ణచంద్ర, ఎల్.శ్రీదేవి, కె.రాజ్యలక్ష్మి, వై.చంద్రశేఖర్, ఎస్.వెంకటరావు, ఎస్.క్రాంతికుమార్, బి.నాయుడుబాబు, జీకీర్తన పాల్గొన్నారు.

కిరాణా, మర్చంట్స్ అసోసియేషన్ కార్యవర్గం



శ్రీనివాసరావు, అధ్యక్షుడు

ఎలమంచిలి, జూలై 13 : పట్టణంలో కిరాణాఅండ్ మర్చంట్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. తొలుత సంఘం అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలై చర్చించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునిగా లింగంపల్లి శ్రీనివాసరావు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా భరత్, కోశాధికారిగా మురళిలను కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు.

'పంచకర్ల'ను కలిసిన న్యాయ వర్సిటీ వీసీ



సబ్బవరం, జూలై 13 : ఇక్కడి దామోదరం సంజీ వయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెస్ డి.సూర్యప్రకాశ రావు శనివారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.

రాజయ్యపేటలో పూరిల్లు దగ్ధం



ఇంటిని చుట్టిముట్టిన మంటలు

నక్కపల్లి, జూలై 13 : మత్స్యకార గ్రామం రాజయ్యపేటలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన పిక్కి పాపయ్యమ్మ ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకవ్వడంతో మంటలు ఎగసిపడ్డాయి. వస్తువులు, నగదు కాలిబూడిదవ్వడంతో కట్టుబట్టలతో బాధిత కుటుంబం రోడ్డునపడింది. నక్కపల్లి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. విషయం తెలిసిన వెంటనే హోం మంత్రి అనిత స్థానిక తహసీల్దార్ శ్రీకాంత్‌కు ఫోన్ చేసి, తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ ఆదేశాల మేరకు నాయకులు పిక్కిస్వామి, కురందాసు అప్పలరాజు బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులతో పాటు రూ.ఐదు వేల నగదు అందజేశారు.

ఏయూలో అక్రమాలపై విచారణకు...

... 3వ పేజీ తరువాయి

టీచింగ్ అనుభవం లేదని, ఇతర అర్హతలు ఏమీ లేకున్నా గైడ్‌గా ఎలా నియమిస్తారని చాలామంది ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురిస్తే, టీడీఆర్ హబ్ డీన్ జేమ్స్ స్టీఫెన్ ఆమె నియామకాన్ని సమర్థిస్తూ ప్రకటన ఇచ్చారు. ప్రొసీజర్ ప్రకారమే నియమించామని చెబుతున్నారు. అది అవాస్తవమని, నిబంధనలు తుంగలో తొక్కి ఆమెకు అక్కడ అగ్రాసనం వేశారని అంతా కోడై కూస్తున్నా యూనివర్సిటీ తరపున ఎవరూ స్పందించడం లేదు. దానిపై విచారణ చేస్తామని గానీ, ఆమెను తొలగిస్తామని గానీ అధికారికంగా ఎవరూ చెప్పడం లేదు. ఇప్పటికీ యూనివర్సిటీ ప్రసాదరెడ్డి కనుసన్నల్లోనే నడుస్తోందని చెప్పడానికి ఇదే పెద్ద ఉదాహరణ. విశాఖపట్నంలో గల తెలుగుదేశం నాయకులు...ఇక్కడి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వర్సిటీని గాడిలో పెట్టే వారికి బాధ్యతలు అప్పగించేలా కృషిచేయాల్సి ఉంది. ఇదిలావుండగా ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్ అధికారిని నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. అలాకాకుండా సీనియర్ ప్రొఫెసర్‌కే ఆ బాధ్యతలు ఇస్తే ప్రక్షాళన చేయవచ్చునంటున్నారు.

షుగర్ ఫ్యాక్టరీలకు పూర్వ వైభవం

... 3వ పేజీ తరువాయి

అనుబంధ పంటలు పండించే వ్యవసాయ పంట భూములు పుష్కలంగా ఉండడం, సాగునీటి వనరులు కూడా అందుబాటులో ఉండడంతో ఇథనాల్ తయారీకి ఉపయోగించే చెరకుతో పాటు, ఇతర పంటల ఉత్పత్తికి కూడా వీలుందని అధికారులు అంటున్నారు. గోవాడలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు గతంలో గోవాడ యాజమాన్యం పంపిన ప్రతిపాదనకు గత ఏడాదే కేంద్ర పర్యావరణశాఖ అనుమతి కూడా లభించింది. గోవాడ ఫ్యాక్టరీలో 60 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.102 కోట్లతో డీపీఆర్ కూడా తయారై ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉంది. ఈ 102 కోట్లలో 85 శాతం బ్యాంకుల నుంచి రుణం మంజూరవుతుంది. ఈ రుణానికి వడ్డీ రాయితీ కూడా లభించే అవకాశాలు ఉన్నట్టు చెబుతున్నారు. గోవాడ యాజమాన్యం కేవలం 15 శాతం నిధులు జమ చేయవలసి ఉంటుంది. బ్యాంకులకు ఇచ్చే రుణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వవలసి ఉంటుంది. సీఎం చంద్రబాబు స్పష్టంగా ప్రకటన చేయడంతో ప్రభుత్వం ఇథనాల్ ప్లాంట్‌కు అవసరమైన ప్రభుత్వ గ్యారంటీ రావడం ఖాయంగా కనిపిస్తున్నది.

ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుతో గోవాడకు మనుగడ

ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటయితే ఫ్యాక్టరీలో పంచదార ఉత్పత్తి తగ్గించి ఇథనాల్ తయారీ చేపట్టే అవకాశం ఉంది. వాస్తవానికి ప్రస్తుతం పంచదార ఉత్పత్తి వల్ల ఫ్యాక్టరీకి గానీ, రైతుకు గానీ గిట్టుబాటు కావడం లేదు. చెరకు రైతులకు టన్నుకు సుమారుగా రూ.2900 ధర ఇస్తుంటే, బహిరంగ మార్కెట్‌లో పంచదార క్వింటాలు రూ.3100 ఉంది. క్వింటాలు పంచదార ఉత్పత్తికి సుమారుగా రూ.3,800 వరకూ ఖర్చవుతున్నది. ఈ లెక్కన బస్తా పంచదారపై ఫ్యాక్టరీ రూ.700 నష్టపోతున్నది. అంటే లక్ష టన్నులు చెరకు ఆడితే ఫ్యాక్టరీకి రూ.7 కోట్లు నష్టం తప్పనిసరిగా ఉంది. ఈ దశలో పంచదార ఉత్పత్తి చేయడం వల్ల నష్టం తప్ప లాభం ఉండడం లేదు. అదే ఇథనాల్ తయారీ వల్ల నష్టం ఉండే అవకాశం ఏమాత్రం లేదనే చెప్పాలి. మొలాసిస్ ద్వారా తయారు చేసే ఇథనాల్‌కు లీటరు రూ.60 వరకూ ఉందని సమాచారం. ఈ లెక్కన ఇథనాల్ తయారీ వల్ల ఫ్యాక్టరీకి ఆదాయమే తప్ప, నష్టం వచ్చే అవకాశాలు లేవని నిపుణులు అంటున్నారు.

ఇతర పంటల రైతులకూ మేలే

ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు చెరకుతో పాటు బియ్యం, మొక్కజొన్న, తృణధాన్యాలు, చెరకు పిప్పి కూడా ఇథనాల్ తయారీలో ఉపయోగిచేందుకు అవకాశం ఉండడంతో ఫ్యాక్టరీ పరిధిలో చెరకుతో పాటు ఇతర పంటలు పండించే రైతులకు కూడా మేలు చేకూరేందుకు అవకాశం ఉంది. మొత్తం మీద ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు వల్ల ఫ్యాక్టరీలు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉండడంతో ప్రభుత్వం ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధమైనట్టు చెబుతున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సమష్టిగా ముందుకు సాగుదాం

- సమన్వయ కమిటీ సమావేశంలో టీడీపీ నాయకుడు 'ప్రగడ'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, జూలై 13 : నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టిగా ముందుకు సాగుదామని ఎలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని సూచించారు. కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని వివరించారు. అధిష్ఠానం నుంచి వచ్చిన జాబితా మేరకు నాయకులు ధూళి రంగనాయకులు, రాజాన రమేష్, కొలుకులూరి విజయ్ బాబు, దిన్‌బాబు, దొడ్డి శ్రీను, జనపరెడ్డి నరసింగరావు తదితరులంతా నియోజకవర్గంలో చేపట్టాల్సిన కార్యక్రమాలను ఆయన వివరించారు. అచ్యుతాపురం మండలానికి చెందిన టీడీపీ నాయకుడు కొండబాబు మాట్లాడుతూ తమ గ్రామంలో జెట్టీ నిర్మాణం కోసమని ఎమ్మెల్యేను కలవడానికి వెళ్లి రెండున్నర గంటల పాటు వేచి ఉన్నా కలవలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఎలమంచిలికి చెందిన నాయకులు రమణబాబుతో పాటు పలువురు మాట్లాడుతూ టీడీపీ నేతల ప్రమేయం లేకుండా మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను మార్చారన్నారు. అనంతరం ప్రగడ మాట్లాడుతూ ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకుని ముందుకు సాగుదామన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ ప్రతినిధి కృష్ణ, నాయకులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, రాజాన సూర్యనాగేశ్వరరావు, కొఠారు సాంబ, కాండ్రకోట చిరంజీవి, గొర్లె నానాజీ, రాజాన నారాయణమ్మ, ఇత్తంశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

'అగ్నిపథ్‌పై అనకాపల్లిలో యువతకు శిక్షణ ఇచ్చేందుకు కృషి'



సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతరావు


కొత్తూరు, జూలై 13 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర సైనికొసెల్ కో-కన్వీనర్ అగ్గాల హనుమంతరావు కోరారు. శనివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇందులో చేరితే ఏటా జీతం పెరగడంతో పాటు నాలుగేళ్లు పూర్తయితే కార్పస్ ఫండ్ కూడా ఉంటుం దన్నారు. త్వరలో ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణలతో చర్చించి అనకాపల్లి ప్రాంత యువతకు శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తామని వివరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మాజీ సైనికులు నారిపల్లి సత్యారావు, ఎస్.వరప్రసాద్, కర్రి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొణతాల

జగన్నాథుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

అనకాపల్లి టౌన్, జూలై 13 : జగన్నాథస్వామి రథోత్సవాలు పట్టణంలో అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గూడ్స్‌షెడ్డు వద్ద గల ఇంద్రజ్యుమ్న హాల్‌లో కొలువుదీరిన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో కోలాహల వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శనివారం రాత్రి రామావతారంలో ఉన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, సభ్యులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఇంద్ర జ్యుమ్నాహాల్ ఆవరణలో అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని బృందం ఆలపించిన గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



ఇంద్రజ్యుమ్న హాలు వద్ద భక్తుల కోలాహలం

ఇళ్ల పట్టాల పంపిణీలో అవినీతి

- విచారణకు ఎంపీటీసీ విజయ్‌తో పాటు వార్డు సభ్యులు డిమాండ్



సర్పంచ్‌కు వినతిని అందిస్తున్న విజయ్ తదితరులు

తుమ్మపాల, జూలై 13 : బవులవాడ పంచాయతీ పరిధిలో జగనన్న కాలనీ ఇళ్ల పట్టాల పంపిణీలో జరిగిన అక్రమాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని ఎంపీటీసీ తోటాడ విజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వార్డు సభ్యులతో కలిసి సర్పంచ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పేదల నుంచి వేలాది రూపాయలు అక్రమంగా వసూలు చేసి ఇళ్ల పట్టా లను పంపిణీ చేశారని ఆరోపించారు. అర్హులు కాకపోయినప్పటికీ పలువురికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్టు చెప్పారు. ఇందులో లక్షలాది రూపాయల కుంభకోణం దాగి ఉందన్నారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు బత్తుల రమేష్ పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి కన్నబాబు పరామర్శ



కుటుంబంతో మాట్లాడుతున్న కన్నబాబురాజు

రాంబిల్లి, జూలై 13 : ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన లాలంకోడూరు సర్పంచ్ రమణమూర్తి కుటుంబాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు పరామర్శించారు. రమణమూర్తి సతీమణి శైలజా శిరీషతో మాట్లాడి, ఆమెను ఓదార్చారు. జడ్పీటీసీ ధూళి నాగరాజు, వైస్ ఎంపీపీ కశిరెడ్డి నర్సింగరావు, వైసీపీ మండల కన్వీనర్ పి.కిశోర్, మాజీ కన్వీనర్ జి.శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతమైన గ్రంథం భగవద్గీత

తుమ్మపాల, జూలై 13 : విద్యార్థి దశ నుంచే భారతీయ సంప్రదాయాలతో పాటు సంస్కృతిని అలవర్చుకోవాలని వీహెచ్‌పీ ప్రతినిధి ఇవటూరి కూర్మనాథం అన్నారు. గవరపాలెం గురుకుల పాఠశాలలో భగవద్గీతపై శనివారం వివరించారు. ఉన్నతమైన గ్రంథం భగవద్గీతగా పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది ఓం ప్రసాద్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్ పాల్గొన్నారు.

రైతుల సహకారంతో ఆవ గేట్ల మధ్య పిల్లర్‌కు మరమ్మతులు

- వైసీపీ ప్రభుత్వ హయాంలో పదేపదే మొరపెట్టుకున్నా పట్టించుకోని పాలకులు



ఆవ గేట్ల మధ్య పిల్లర్ పనులను పరిశీలిస్తున్న రైతులు

పాయకరావుపేట రూరల్, జూలై 13 : మండలంలోని గోపాలపట్నం సమీపంలో ఆవ చెరువు గేట్ల మధ్య పిల్లర్ దెబ్బతి నడంతో రైతులు ముందుకు వచ్చారు. వారి సహకారంతో మరమ్మతుకు శ్రీకారం చుట్టారు. గత కొన్నేళ్ల క్రితం ఆవ గేట్ల మధ్య పిల్లర్ దెబ్బతిని గేట్లుఎత్తే సమయంలో కూలిపోయే ప్రమాదం ఏర్పడింది. దీనికి మరమ్మతులు చేపట్టండి మహాప్రభో.. అంటూ పదేపదే వైసీపీ పాలకులను రైతులు వేడుకున్నా ఫలితం లేకపోయింది. సాగునీటి శాఖ డీఈఈ ఎస్.జగదీశ్వరరావు, ఏఈ శ్రీరా మ్మూర్తి పిల్లర్‌ను పరిశీలించి తాత్కాలిక మరమ్మతులకు రూ.70 వేలతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. నిధులు మంజూరు కాకపోవడంతో రైతులే సమావేశమై ఓనిర్ణయానికి వచ్చారు. తాండవ నది నుంచి ఆవలోకి నీరు చేరితే పనులు చేపట్టడానికి వీలు పడదని భావించిన గోపాలపట్నం, పెంటకోట, గునుపూడి, బంగారమ్మపేట తదితర గ్రామాల రైతులు తాత్కాలిక పనులు ప్రారంభించారు. ఆవ కింద సుమారు 2500 ఎకరాల ఆయకట్టు ఉంది. గేట్లు మధ్య పిల్లర్ కూలితే ఈ భూముల్లో సాగు కష్టమని భావించి, గేట్ల వద్దకు నీరు చేరకుండా ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేసి పిల్లర్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆవ కాలువ మాజీ చైర్మన్ గణపర్తి దొరబాబు, రాజుబాబు, జి.నారాయణరావు, బాబారాజు, గోపీరాజు, కోనేటి నాగేశ్వరరావు, కోనేటి చంద్రమౌళి, పిడుగు సూరి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో 'ఏఎంఏఎల్'లో డైనింగ్ హాలు ప్రారంభం



డైనింగ్ హాలును ప్రారంభిస్తున్న దృశ్యం

కొత్తూరు, జూలై 13 : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం రూ.ఆరు లక్షలతో నిర్మించిన డైనింగ్ హాల్‌ను శనివారం రాష్ట్ర ఔషధ నియంత్రణ విభాగం విశ్రాంత సహాయ సంచాలకుడు కాండ్రేగుల సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ విదేశాల్లో ఉన్న పలువురు పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేడ అప్పారావు, పెనుమత్స కృష్ణరాజు, జార్జిక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ఎంకే జోగినాయుడు, బుద్ద కాశీ విశ్వేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు, సూపరింటెండెంట్ అనురాధ, పాలకవర్గ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు కష్టకాలం!

... 3వ పేజీ తరువాయి

చూస్తున్నారు. కాగా జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు పరిస్థితులను చూస్తే కాస్త కష్టంగానే ఉందని జిల్లా వ్యవసాయాధికారి జి.మోహన్‌రావు తెలిపారు. వర్షాలు కురి స్తేనే సాగు పనులు జోరందుకుంటాయన్నారు.

ఎండిపోతున్న వరి ఆకు

చీడికాడ: మండలంలో చీడిపల్లి, అర్జునగిరి, చుక్కపల్లి, చెట్టుపల్లి వంటి మెట్టు ప్రాంతాల్లో వారం రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో మొలకలు కనిపించిన వరి ఆకు ఎండిపోతోంది. విత్తనాలు వేసిన అనంతరం వారం రోజులపాటు మండుతున్న ఎండలకు పొలాల్లో ఉన్న వరి ఆకు మాడిపోతోంది. దీంతో చీడిపల్లి, ఎస్.కొత్తూరు గ్రామాల్లో వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు పైపుల ద్వారా నీటితడుపులు పెడుతున్నారు. ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన పెనగంటి దేముడు తన పొలంలో వేసిన రెండు నారుమళ్లను పైపుల ద్వారా నీటి తడుపులు పెట్టారు. నీటి ఆధారం లేని రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

'మావూరి' మాతృమూర్తికి స్పీకర్ నివాళి



మావూరి తల్లి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అయ్యన్న

నర్సీపట్నం, జూలై 13 : రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు శనివారం సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల మావూరి వెంకటరమణ తల్లి అకాల మరణం చెందడంతో సభాపతి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆమె చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు.

ధ్వజస్తంభం ఏర్పాటుకు ఇత్తడి సేకరణ



గ్రామస్థుల నుంచి ఇత్తడి సేకరిస్తున్న నిర్వాహకులు

మాడుగుల, జూలై 13 : మాడుగులలోని పురాతన ఆలయమైన శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గల ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగులు వేసేందుకు శనివారం తొలి రోజు చేపట్టిన ఇత్తడి సేకరణకు భక్తులు, ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. గత పదేళ్ల కిందట గ్రామానికి చెందిన వేణుగోపాలస్వామి ఆలయంలో పెరుమాళ్ల వెంకటరావు ధ్వజ స్తంభం ఏర్పాటు చేశారు. తాజాగా ఆ ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగులు వేయాలని భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో వారి నుంచి ఇత్తడి సేకరణ మొదలుపెట్టారు. ఈ క్రమంలో తొలి రోజు 150 కిలోల ఇత్తడి సేకరణ జరిగిందని గ్రామ పెద్దలు తెలిపారు. మొత్తం 4 వందల కిలోలకు పైగా ఇత్తడి అవసరమని చెప్పారు. ఇందుకోసం బయట గ్రామాలకు చెందిన భక్తులు కూడా ఇత్తడి విరాళంగా ఇవ్వవచ్చని కోరారు. ఆదివారం కూడా గ్రామంలో ఇత్తడి సేకరణ చేపట్టనున్నట్టు తెలిపారు.

టీడీపీ సీనియర్ నేత 'పీలా' కన్నుమూత



చోడవరం, జూలై 13 : మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పీలా సూర్యనారాయణ (52) శనివారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశారు. పట్టణ శివారు పీఎస్‌పేటకు చెందిన సూర్యనారాయణ టీడీపీలో పార్టీ పదవులతో పాటు సహకార సంఘం ఉపాధ్యక్షుడిగా, చోడవరం చెరకు అభివృద్ధి మండలి డైరెక్టర్‌గా, పీఎస్‌పేట పాలసంఘం అధ్యక్షునిగా పదవులు నిర్వహించారు. శనివారం ఉదయం గుండెపోటుకు గురైన సూర్యనారాయణను కుటుంబసభ్యులు విశాఖ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందారు. సూర్యనారాయణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పీలా మృతికి స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, నాయకులు చీపురుపల్లి సూర్యనారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక డ్రైవ్



పనులు పర్యవేక్షిస్తున్న ఈవో లవరాజు

బుచ్చెయ్యపేట, జూలై 13 : మండలంలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. 35 గ్రామ పంచాయతీల పరిధిలో తుప్పల తొలగింపు, కాలువల్లో పూడికతీత, తాగునీటి ట్యాంకుల్లో నీటి నాణ్యత పరీక్షలకు నమూనాల సేకరణ, దోమల నివారణపై అవగాహనకలిగించడం వంటి చర్యలు చేపట్టారు. వడ్డాదిలో పంచాయతీలో చేపట్టిన పనులను ఈవో లవ రాజు, ఉప సర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరరావు, వార్డు మెంబరు దొండా నరేష్ తదితరులు పర్యవేక్షించారు.

సాయిబాబా ఆలయానికి బెంచీల వితరణ



సిమెంట్ బెంచీలను అందజేస్తున్న రమణ

రోలుగుంట, జూలై 13 : మండలంలోని కొవ్వూరులో ఉన్న సాయిబాబా ఆలయం వద్ద భక్తులు కూర్చోవడానికి అనువుగా సిమెంట్ బెంచీలను బుచ్చెంపేట గ్రామానికి చెందిన వార్డు కార్యదర్శి అనిమిరెడ్డి రమణ వితరణగా అందించారు. శనివారం ఆలయం వద్ద సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయించారు.మండలంలోని పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాల్లో భాగంగా రమణ సిమెంట్ బెంచీలను అందించడం, అన్నదానాలు చేయడం చేస్తున్నారు. తాజాగా సాయిబాబా భక్తుల సౌకర్యార్థం బల్లలను ఏర్పాటు చేయడంపై స్థానిక జనసేన కార్యకర్తలు ఎస్.చందు, చక్రి, మాజీ సర్పంచ్ కె.ఈశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

పశుగ్రాసంపై అవగాహన సదస్సు

చీడికాడ, జూలై 13 : పశువులకు సరైన మోతాదులో నాణ్యమైన పశుగ్రాసాన్ని అందించడం ద్వారా పాల దిగుబడి అధికంగా పొందవచ్చని పశువైద్య సిబ్బంది కురచాఅర్జునమూర్తి, ఎం.శ్రీనివాసరావు అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని జి.కొత్తపల్లి, జైతవరం, బి.సింగవరం గ్రామాల్లో పశుగ్రాసం ఆవశ్యకతపై శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

'భరోసా' లేకుంటే చదువు సాగదే!

- అసంపూర్తిగా ఎ.శరభవరం ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం
- ఏడాదిన్నరగా రైతు భరోసా కేంద్రంలోనే చదువులు
- శ్లాబ్ నుంచి పెచ్చులు పడుతుండడంతో ప్రమాదకరంగా పరిస్థితి



రైతు భరోసా వరండాలో చదువుకుంటున్న విద్యార్థులు



అసంపూర్తిగా పనులు నిలిచిపోయిన పాఠశాల భవనం

నాతవరం, జూలై 13 : నాతవరం మండలం ఎంబీ పట్నం పంచాయతీ ఎ.శరభవరం గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఏడాదిన్నర నుంచి రైతు భరోసా కేంద్రంలో చదువులు సాగిస్తున్నారు. స్కూలు భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో 2022లో అప్పటి ప్రభుత్వం నాడు-నేడులో కింద నూతన భవనం, వంటషెడ్డు నిర్మాణానికి రూ.32 లక్షలు మంజూరు చేసింది. అయితే కేవలం రూ.12 లక్షలు మాత్రమే విడుదల చేయడంతో పనులు చేపట్టినా అసంపూర్తిగానే మిగిలిపోయాయి.

మరోవైపు.. ప్రస్తుతం పిల్లలు చదువుతున్న రైతు భరోసా కేంద్రం కూడా పాడైంది. శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతుండడంతో ఉపాధ్యాయులు, పిల్లలు దినదిన గండంగా కాలం వెళ్లదీస్తున్నారు. స్కూలు పరిస్థితి ఇలా ఉండడంతో సుమారు 20 మంది విద్యార్థులు ఇక్కడ చదువు మానేసి ప్రైవేటు స్కూళ్లల్లో చేరిపోయారు. ప్రస్తుతం 20 మంది మిగిలారు. వీరికి ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఏడాదిన్నర కావస్తున్నా.. పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో రైతు భరోసా కేంద్రంలోనే పిల్లలు చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా ఎన్నాళ్లని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన ఎ.శరభవరంలో పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఇంత నిర్లక్ష్యం తగదు



పిల్లల చదువు విషయంలో ప్రభుత్వాలు ఇంత నిర్లక్ష్యం వహించడం చాలా అన్యాయం. మంజూరు చేసిన నిధులు పూర్తిగా ఇవ్వకుంటే ఎలా? ఇప్పుడు చూడండి. చదువుకుందామంటే పిల్లలకు సరైన బడి లేకుండా పోయింది. ఎప్పటికప్పుడే పై కప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. స్కూలు నుంచి పిల్లవాడు క్షేమంగా ఇంటికి వస్తాడనే నమ్మకం లేకుండా పోయింది. దీంతో 20 మంది పిల్లలు మానేశారు. ఇలా జరగకూడదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

- కంపాటి శివాజీ, ఎ.శరభవరం

మెనూ చార్జీలు పెంచాలి

- మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న



విలేకరులతో మాట్లాడుతున్న ప్రసన్న

కృష్ణాదేవిపేట, జూలై 13 : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం పథకం మెనూ చార్జీలు పెంచాలని ఆ పథకం కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.ప్రసన్న డిమాండ్ చేశారు. శనివారం గొలుగొండ మండల కేంద్రంలో జిల్లా సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న మెనూ చార్జీలు నిత్యావసర ధరలకు అనుగుణంగా పెంచాలన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన మెనూకు, ఇస్తున్న చార్జీలకు పొంతన లేదన్నారు. అవసరమైన గ్యాస్‌ను ప్రభుత్వమే పంపిణీ చేయాలన్నారు. అనంతరం ఐద్వా జిల్లా ట్రెజరల్ కేవీ సూర్యప్రభ మాట్లాడుతూఈ పథకం అమలు చేసి ఏళ్లు గడుస్తున్నా నేటికీ కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, రిటైర్‌మెంట్ సదుపాయాలు, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్మికులపై రాజకీయ వేధింపులు, తొలగింపు చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

17 నుంచి ఆపద హర వేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, జూలై 13 : పట్టణంలో ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న ఆపద హర శ్రీవేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పిలుపునిచ్చారు. శనివారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన పవిత్రోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు శాంతారామాచార్యులు, స్థానిక పెద్దలు తేలపల్లి నాగేశ్వరరావు, ఎంపీటీసీ నాయుడు, మెంబర్‌శ్రీను, సేనాపతి శ్రీను. సంతోష్ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి సహకరించండి

- చోడవరం ఎమ్మెల్యేకు హనుమాన్ ఆటో యూనియన్ నేతల వినతి



ఎమ్మెల్యే రాజును కలిసిన ఆటో యూనియన్ నాయకులు

రోలుగుంట, జూలై 13 : స్థానిక గ్రంథాలయం పక్కన ఉన్న ఆటో యూనియన్ కార్యాలయ భవనానికి ప్రహరీ నిర్మించేందుకు సహకరించాలని కోరుతూ చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజును స్థానిక హనుమాన్ ఆటో యూనియన్ నాయకులు కోరారు. శనివారం ఎమ్మెల్యేను సంఘ ప్రతినిధులు కలిసి కూటమి ప్రభుత్వం ఏర్పడడంపై అభినందనలు తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలోనే యూనియన్ కార్యకలాపాలకు పక్కా స్థలం, భవనాన్ని మంజూరు చేశారని గుర్తు చేశారు. ఆటో డ్రైవర్ల ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బనికెల తాతీలు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు కష్టకాలం!

... 3వ పేజీ తరువాయి

చూస్తున్నారు. కాగా జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు పరిస్థితులను చూస్తే కాస్త కష్టంగానే ఉందని జిల్లా వ్యవసాయాధికారి జి.మోహన్‌రావు తెలిపారు. వర్షాలు కురిస్తేనే సాగు పనులు జోరందుకుంటాయన్నారు.

ఎండిపోతున్న వరి ఆకు

చీడికాడ : మండలంలో చీడిపల్లి, అర్జునగిరి, చుక్కపల్లి, చెట్టుపల్లి వంటి మెట్టు ప్రాంతాల్లో వారం రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో మొలకలు కనిపించిన వరి ఆకు ఎండిపోతోంది. విత్తనాలు వేసిన అనంతరం వారం రోజులపాటు మండుతున్న ఎండలకు పొలాల్లో ఉన్న వరి ఆకు మాడిపోతోంది. దీంతో చీడిపల్లి, ఎన్. కొత్తూరు గ్రామాల్లో వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు పైపుల ద్వారా నీటితడుపులు పెడుతున్నారు. ఎన్.కొత్తూరు గ్రామానికి చెందిన పెనగంటి దేముడు తన పొలంలో వేసిన రెండు నారుమళ్లను పైపుల ద్వారా నీటి తడుపులు పెట్టారు. నీటి ఆధారం లేని రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు.

జ్వర పీడితులకు రక్త పరీక్షలు



గొప్పూరులో రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది

చీడికాడ, జూలై 13 : మండలంలోని వీరభద్రునిపేట శివారు గొప్పూరులో శనివారం ఇంటింటి రక్తపరీక్షల సేకరణ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 కుటుంబాలు ఉన్న గ్రామంలో 115 మందికి రక్తపరీక్షలు నిర్వహించగా, ముగ్గురికి జ్వరాలు ఉన్నట్టు గుర్తించారు. అందరికీ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడిన వారిని గుర్తించేందుకు గిరిజన గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరికీ రక్తపరీక్షలు నిర్వహిస్తున్నట్టు హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరావు తెలిపారు. గత ఏడాది చీడికాడ పీహెచ్‌సీ పరిధిలోని గొప్పూరు, జాజులపాలెం, పనసగెడ్డ, కొత్తవీధి, బందవీధి, శిరిజాం గ్రామాల్లో వ్యాధుల తీవ్రత ఎక్కువగా కనిపించిందన్నారు. అందుకే ప్రత్యేకంగా ఇప్పుడే రక్తనమూనాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పేరునాయుడు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఏయూలో అక్రమాలపై విచారణకు మీనమేషాలు

... 3వ పేజీ తరువాయి

టీచింగ్ అనుభవం లేదని, ఇతర అర్హతలు ఏమీ లేకున్నా గైడ్‌గా ఎలా నియమిస్తారని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురిస్తే, టీడీఆర్ హబ్ డీన్ జేమ్స్ స్టీఫెన్ ఆమె నియామకాన్ని సమర్థిస్తూ ప్రకటన ఇచ్చారు. ప్రొసీజర్ ప్రకారమే నియమించామని చెబుతున్నారు. అది అవాస్తవమని, నిబంధనలు తుంగలో తొక్కి ఆమెకు అక్కడ అగ్రాసనం వేశారని అంతా కోడై కూస్తున్నా యూనివర్సిటీ తరపున ఎవరూ స్పందించడం లేదు. దానిపై విచారణ చేస్తామని గానీ, ఆమెను తొలగిస్తామని గానీ అధికారికంగా ఎవరూ చెప్పడం లేదు. ఇప్పటికీ యూనివర్సిటీ ప్రసాదరెడ్డి కనుసన్నల్లోనే నడుస్తోందని చెప్పడానికి ఇదే పెద్ద ఉదాహరణ. విశాఖపట్నంలో గల తెలుగుదేశం నాయకులు...ఇక్కడి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వర్సిటీని గాడిలో పెట్టే వారికి బాధ్యతలు అప్పగించేలా కృషిచేయాల్సి ఉంది. ఇదిలావుండగా ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్ అధికారిని నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. అలాకాకుండా సీనియర్ ప్రొఫెసర్‌కే ఆ బాధ్యతలు ఇస్తే ప్రక్షాళన చేయవచ్చునంటున్నారు.

షుగర్ ఫ్యాక్టరీలకు పూర్వ వైభవం

... 3వ పేజీ తరువాయి

అనుబంధ పంటలు పండించే వ్యవసాయ పంట భూములు పుష్కలంగా ఉండడం, సాగునీటి వనరులు కూడా అందుబాటులో ఉండడంతో ఇథనాల్ తయారీకి ఉపయోగించే చెరకుతో పాటు, ఇతర పంటల ఉత్పత్తికి కూడా వీలుందని అధికారులు అంటున్నారు. గోవాడలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు గతంలో గోవాడ యాజమాన్యం పంపిన ప్రతిపాదనకు గత ఏడాదే కేంద్ర పర్యావరణశాఖ అనుమతి కూడా లభించింది. గోవాడ ఫ్యాక్టరీలో 60 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.102 కోట్లతో డీపీఆర్ కూడా తయారై ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉంది. ఈ 102 కోట్లలో 85 శాతం బ్యాంకుల నుంచి రుణం మంజూరవుతుంది. ఈ రుణానికి వడ్డీ రాయితీ కూడా లభించే అవకాశాలు ఉన్నట్టు చెబుతున్నారు. గోవాడ యాజమాన్యం కేవలం 15 శాతం నిధులు జమ చేయవలసి ఉంటుంది. బ్యాంకులకు ఇచ్చే రుణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వవలసి ఉంటుంది. సీఎం చంద్రబాబు స్పష్టంగా ప్రకటన చేయడంతో ప్రభుత్వం ఇథనాల్ ప్లాంట్‌కు అవసరమైన ప్రభుత్వ గ్యారంటీ రావడం ఖాయంగా కనిపిస్తున్నది.

ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుతో గోవాడకు మనుగడ

ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటయితే ఫ్యాక్టరీలో పంచదార ఉత్పత్తి తగ్గించి ఇథనాల్ తయారీ చేపట్టే అవకాశం ఉంది. వాస్తవానికి ప్రస్తుతం పంచదార ఉత్పత్తి వల్ల ఫ్యాక్టరీకి గానీ, రైతుకు గానీ గిట్టుబాటు కావడం లేదు. చెరకు రైతులకు టన్నుకు సుమారుగా రూ.2900 ధర ఇస్తుంటే, బహిరంగ మార్కెట్‌లో పంచదార క్వింటాలు రూ.3100 ఉంది. క్వింటాలు పంచదార ఉత్పత్తికి సుమారుగా రూ.3,800 వరకూ ఖర్చవుతున్నది. ఈ లెక్కన బస్తా పంచదారపై ఫ్యాక్టరీ రూ.700 నష్టపోతున్నది. అంటే లక్ష టన్నులు చెరకు ఆడితే ఫ్యాక్టరీకి రూ.7 కోట్లు నష్టం తప్పనిసరిగా ఉంది. ఈ దశలో పంచదార ఉత్పత్తి చేయడం వల్ల నష్టం తప్ప లాభం ఉండడం లేదు. అదే ఇథనాల్ తయారీ వల్ల నష్టం ఉండే అవకాశం ఏమాత్రం లేదనే చెప్పాలి. మొలాసిస్ ద్వారా తయారు చేసే ఇథనాల్‌కు లీటరు రూ.60 వరకూ ఉందని సమాచారం. ఈ లెక్కన ఇథనాల్ తయారీ వల్ల ఫ్యాక్టరీకి ఆదాయమే తప్ప, నష్టం వచ్చే అవకాశాలు లేవని నిపుణులు అంటున్నారు.

ఇతర పంటల రైతులకూ మేలే

ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు చెరకుతో పాటు బియ్యం, మొక్కజొన్న, తృణధాన్యాలు, చెరకు పిప్పి కూడా ఇథనాల్ తయారీలో ఉపయోగించేందుకు అవకాశం ఉండడంతో ఫ్యాక్టరీ పరిధిలో చెరకుతో పాటు ఇతర పంటలు పండించే రైతులకు కూడా మేలు చేకూరేందుకు అవకాశం ఉంది. మొత్తం మీద ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు వల్ల ఫ్యాక్టరీలు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉండడంతో ప్రభుత్వం ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధమైనట్టు చెబుతున్నారు.

పశువుల ఆస్పత్రి భవనం పూర్తి

- విశాఖ డెయిరీ సహకారంతో నిర్మాణం



వడ్డాదిలో పూర్తయిన పశువైద్యశాల భవనం

బుచ్చెయ్యపేట, జూలై 13 : వడ్డాది పశువుల ఆస్పత్రికి ఎట్టకేలకు వసతి సమస్య తీరింది. విశాఖ డెయిరీ సహకారంతో చేపట్టిన భవన నిర్మాణం పూర్తయింది. ఈ ఆస్పత్రి చాలాకాలం నుంచి శిథిల భవనంలో నడుస్తోంది. పాత పెంకుల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో గత ఏడాది కిందట రెండు గదుల్లో ఒక గది పై కప్పు కూలిపోయింది. మందులు, ఇతర సామా గ్రి తడిసి పాడయ్యాయి. అయినా వైద్యసిబ్బంది అదే భవనంలో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. కొత్త భవన నిర్మాణానికి పలుమార్లు ప్రతిపాదనలు పంపించినా ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. ఆస్పత్రి సిబ్బంది పడుతున్న కష్టాలను చూడలేక స్థానిక నాయకులు, రైతులు కలిసి ఈ సమస్యను విశాఖ డెయిరీ డైరెక్టరు గేదెల సత్యనారాయణ ద్వారా ఛైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. వెంటనే పనులు ప్రారంభించి నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్‌కుమార్‌కు రైతులు, స్థానిక నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్తంగా..

పరశురాముడిగా జగన్నాథుడు



పరశురామ అవతారంలో దర్శనమిచ్చిన జగన్నాథుడు

చోడవరం, జూలై 13 : జగన్నాథుడి దశ రూపమహోత్సవాలలో భాగంగా శనివారం స్వామి పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతా రామాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వాణిబాబు, ఉప్పల బాబు, ఉపాధ్యాయుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా నారు మడులు



పచ్చదనంతో కనిపిస్తున్న వరినాడు మడులు

మాకవరపాలెం, జూలై 13 : మండలంలో వరి నారు మడులు ఆశాజనంగా ఉన్నాయి. వారం కిందట మాకవరపాలెం, గిడుతూరు, తామరం, పైడిపాల, కొండలగ్రహారం, బయ్యవరం తదితర గ్రామాల్లో రైతులు వరినారు మడులు వేశారు. అయితే గత వారం రోజులుగా వర్షాలు పుష్కలంగా కురవడంతో వరినారు మడులు ఆశాజనంగా ఉన్నాయని రైతులు అంటున్నారు. ఇదే విధంగా వర్షాలు పడితే మరో వారం రోజుల్లో దమ్ములు పట్టి వరినాట్లు వేస్తామని పేర్కొంటున్నారు.

18న మరిడిమాంబ అమ్మవారి జాతర



మాడుగుల, జూలై 13 : మాడుగుల శివారు ఖండివరం వెళ్లే దారిలో ఉన్న శ్రీమరిడిమాం బ అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 18న (గురువారం) వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ, రైతు సంఘం సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం అనంతరం మోదకొండమ్మ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు అందించే ఆర్థిక సహాయంతో మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఈ నేపథ్యంలో ఆదివారం అమ్మవారి పండుగ చాటింపు వేసి 16న ఉదయం పది గంటలకు ప్రధాన ఆలయం నుంచి అమ్మవారిని, అమ్మవారి పాదాలను ఊరేగింపుగా తీసుకొని వచ్చి గవరవీధిలో గల బందిల దొడ్డి శతకంపట్టు వద్ద 10:45 గంటలకు కొలువు ఉంచుతారు. అనంతరం జాతర సందర్భంగా 18న సాయంత్ర తిరిగి ఆలయానికి తిరిగి తీసుకొని వెళ్లడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

ఊరటనిచ్చిన వర్షం



వడ్డాదిలో కురుస్తున్న వర్షం

బుచ్చెయ్యపేట, జూలై 13 : మండలంలో శనివారం కురిసిని వర్షం ఎండ తాకిడి నుంచి ఉపశమనం కలిగించింది. మూడు వారాలుగా వరుణుడు మొహం చాటేయడంతో ఉక్కపోత, ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కురిసిన వర్షం వరి ఆకుమడులకు ఊపిరిపోసిందని రైతులు పేర్కొంటున్నారు.

మాడుగులలో..

మాడుగుల : మాడుగుల కేంద్రంలో శనివారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశంలో మబ్బులు కమ్మెయ్యడంతో కనీసం గాలి వీయక ఉక్కపోతతో నానా అవస్థలు పడ్డారు. ఈ తరుణంలో మూడు గంటల సమయం దాటిన తరువాత తేలికపాటి జల్లు పడటంతో వాతావరణం చల్లబడింది.

బస్‌పాస్ శిబిరం రేపు

రావికమతం, జూలై 13 : దివ్యాంగ విద్యార్థులకు బస్‌పాస్‌ల కోసం ఈ నెల 15న మేడివాడ జడ్పీ పాఠశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి ఆర్టీసీ అధికారుల ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభం అవుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, రెండు ఫోటోలతో రావాలన్నారు. ఈ బస్సు పాస్ మూడేళ్ల పాటు ఉపయోగించుకోవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతా ల్లో 50 శాతంరాయితీతో ప్రయాణించవచ్చని తెలిపారు.

నారుమడులు ఎండిపోవడంతో రైతుల్లో ఆందోళన

- వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు

దేవరాపల్లి, జూలై 13 : వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో మండలంలోని పలు చోట్ల నారుమడులు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. వర్షాలు ఆశాజనకంగా లేకపోవడంతో సాగునీటి సదుపాయం లేని పొలాలు నారుమడులు ఎండిపోతున్నాయి. బోరు సౌకర్యం కలిగిన చోట వెయ్యి నుంచి రెండు వేల అడుగుల దూరం నుంచి పైపులు వేసి తడుపుతున్నారు. నారుమడి దశలోనే సాగునీటి కష్టాలు ఇలా ఉంటే మున్ముందు పరిస్థితి మరెంత ఇబ్బందిగా ఉంటుందోనని రైతుల్లో గుబులు నెలకొంది. ఇలాంటి గతానుభవాల నుంచి కొందరు రైతులు వరి కాకుండా సరుగుడు పంట వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఏంచేయాలనే దానిపై వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా నారుమడికి ఒకసారి నీరు పెడితే పది రోజులు వరకు బతుకుతుందన్నారు. నీటిలో కరిగే మల్టీకె మందు ఐదు గ్రాములు చొప్పున ఒక లీటరు నీటికి 80 గ్రాములు మందును కలిపి నారుమడి పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు.